ఎస్‌ఐ, కానిస్టేబుల్ పరీక్షలో లోపాలను సరిచేయండి

- సిఎం కెసిఆర్‌కు కూనంనేని లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎస్‌ఐ, పోలీస్ కానిస్టేబుల్ నియామకాలకు సంబంధించిన ప్రిలిమినరీ రాతపరీక్షలో జరిగిన లోపాలను సరిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు మంగళవారం ఆయన లేఖ రాశారు. పోలీస్ నియామకాల్లో భాగంగా ప్రిలిమినరీ పరీక్షకు దాదాపు ఏడు లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారని వివరించారు. ఈ పరీక్షల ప్రశ్నాపత్రంలో దాదాపు 22 తప్పులు వచ్చాయని తెలిపారు. దీంతో అభ్యర్థులు పరీక్షకు సన్నద్ధమైన పద్ధతిలో ప్రశ్నాపత్రం లేకపోవడంతో తీవ్ర ఆయోమయానికి గురయ్యారని పేర్కొన్నారు. తప్పుగా ముద్రించిన ప్రశ్నలు గుర్తించకుండా ఫలితాలు వెల్లడించడంతో ఉత్తీర్ణత 31 శాతానికి తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కువ మంది అర్హత సాధించలేకపోయారని తెలిపారు. అభ్యర్థుల వ్యక్తిగత మార్కుల ఫలితాలు తెలపకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రంలో సూచించిన నిబంధనల ప్రకారం మార్కుల మూల్యాంకనం చేయలేదని అభ్యర్థులు ఆరోపిస్తున్నారని తెలిపారు. పోలీస్ నియామక ప్రిలిమినరీ పరీక్షలో జరిగిన తప్పుడు ప్రశ్నలకు మార్కులను కలుపుతూ, ఫలితాలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.




దళిత రైతులకు వెంటనే పాసు పుస్తకాలు ఇవ్వాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళిత రైతులకు వెంటనే పాసు పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కిష్టాపుర్ గ్రామంలో ప్రభుత్వం 2015లో 50 దళిత కుటుంబాలకు ఇచ్చిన భూములకు పట్టాల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంగళవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, దళితుల ఆధ్వర్యంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. ప్రభుత్వం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసిన భూములకు బాధితులకు పట్టాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి పాస్ పుస్తకాలు సాధించుకుందామన్నారు. పాసు పుస్తకాలు లేని కారణంగా రైతులకు బ్యాంకు రుణాలు, భీమా, రైతుబంధు అందడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పాసు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ్మినేని వెంట మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నాయకులు గోపాల్, బాలరాజ్, రాయుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి చేత పాఠాలు చదివిస్తున్న వాకాటి కరుణ

బడి శుభ్రతా ముఖ్యం

- రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ
- షేక్‌పేట ప్రభుత్వ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిల్లలకు విద్యాబోధన ఎంత ముఖ్యమో.. పాఠశాల పరిశుభ్రత కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. పిల్లల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) పేరుతో తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు ఎలా జరుగుతుందో తెలుసుకునేందుకు మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ షేక్‌పేట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు.

పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించారు. వారితో పుస్తకంలోని పాఠాలను చదివించారు. పిల్లల ప్రగతిపైనా, ఉపాధ్యాయుల బోధన విధానంపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె.. పాఠశాల ఆవరణ అపరిశుభ్రతపై కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు బోధన ఎంత ముఖ్యమో.. బడి శుభ్రత కూడా అంతే ముఖ్యమని తగిన చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులను ఆదేశించారు. పిల్లల అభ్యాసనా ఫలితాలపై ప్రధానంగా దృష్టిపెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట హైదరాబాద్ డిఇఒ ఆర్.రోహిణి, డిప్యూటీ ఇఒ సామ్యూల్ రాజ్ తదితరులు ఉన్నారు.


లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎన్‌పిఆర్‌డి జాతీయ మహాసభ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

డిసెంబర్ 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో జరుగనున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) అఖిల భారత మూడో మహాసభల లోగోను మంగళవారం హైదరాబాద్‌లో మినిస్టర్ క్వార్టర్స్‌లో వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎన్‌పిఆర్‌డి మహాసభల జయప్రదం కోసం అందరూ కృషి చేయాలన్నారు. వికలాంగుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వికలాంగుల చట్టాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందున్నదని తెలిపారు. వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం వికలాంగులకు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగవైకల్యం శరీరానికే తప్ప ప్రతిభకు కాదని చెప్పారు. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే వారికి ఉచితంగా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి పరికరాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా వినికిడి లోపం కలిగిన వారికి కాక్లియర్ ఇంప్లాంటేశన్ ఆపరేషన్లు ప్రభుత్వం ఉచితంగా చేస్తున్నదని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె వెంకట్, కార్యదర్శి ఎం అడివయ్య మాట్లాడుతూ వికలాంగుల సమస్యలపై అనేక ఉద్యమాలు చేసి విజయాలు సాధించామన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు బి బిక్షయ్య, సంఘం రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేశ్, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఇంచార్జి జగ్గరాజు, సంఘం నాయకులు సత్యనారాయణ, శివశంకర్, రాజు, ఉష తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయం

- ఎనిమిది మెడికల్ కాలేజీలను ప్రారంభించిన సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఒకేసారి ఎనిమిది మెడికల్ కాలేజీలను సిఎం కెసిఆర్ మంగళవారం ప్రారంభించారు. ఆ కాలేజీల్లోని ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతులను హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. అనంతరం సిఎం మాట్లాడారు. 'రాష్ట్ర చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయం. మరిచిపోలేని రోజు. ఒకనాడు అనేక సమస్యలతో తాగునీటికి, సాగునీటికి, కరెంటుకు, మెడికల్ సీటుకి, ఇంజనీరింగ్ సీటుకు ఎన్నో అవస్థలు పడ్డాం. స్వరాష్ట్రాన్ని సాధించుకుని, అద్భుతంగా ఆత్మగౌరవంతో బతుకుతూ దేశానికి మార్గదర్శనం చేస్తూ అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నాం. గతంలో మహబూబ్ నగర్, సిద్దిపేట, నల్లగొండ, సూర్యాపేట, ప్రస్తుతం సంగారెడ్డి, మహబూబాబాద్, మంచిర్యాల, జగిత్యాల, వనపర్తి, కొత్తగూడెం, నాగర్‌కర్నూలు, రామగుండంలో ప్రారంభించుకున్నాం. తెలంగాణ ఉద్యమకారులు, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కృషితోనే కళాశాలల నిర్మాణం రూపుదాల్చిందన్నారు. ప్రతీ జిల్లాకు ఒక మెడికల్ కళాశాల రావాలని సంకల్పించుకున్నాని తెలిపారు. గతంలో 850 ఎంబిబిఎస్ సీట్లు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఉండేవి. వాటి సంఖ్య 2,790కి పెరిగింది. పిజి సీట్లు, సూపర్ స్పెషాలిటీ సీట్లు గణనీయంగా పెంచుకున్నాం. గతంలో 531 పిజి సీట్లు ఉంటే, ప్రస్తుతం 1,180 పిజి సీట్లు అందుబాటులోకి వచ్చాయి. గతంలో సూపర్ స్పెషాలిటీ సీట్లు 70 మాత్రమే ఉంటే, ప్రస్తుతం 152 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా పారామెడికల్ కాలేజీలు త్వరలోనే ప్రారంభించుకునేలా వైద్యారోగ్య మంత్రి హరీష్ రావు చర్యలు చేపడతారు....అని సిఎం తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కళాశాలల సంఖ్య 17కు పెరిగాయి. 16 జిల్లాల్లో ఇవి విస్తరించి ఉన్నాయి. మరో 17 జిల్లాల్లో నూతన మెడికల్ కాలేజీలు ప్రారంభించుకోవాల్సిన అవసరం ఉంది. రాబోయే రోజుల్లో వీటి నిర్మాణం చేపట్టేందుకు సూత్రప్రాయంగా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాబోయే రోజుల్లో మిగిలిన 17 కాలేజీల నిర్మాణం కూడా చేపట్టి, ప్రారంభోత్సవం కూడా నేనే చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి టి.హరీశ్ రావు, మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల కమిషన్ ధృతరాష్ట్రునిలా వ్యవహరిస్తోంది

- మోడీ వచ్చాకే ఎన్నికలను కార్పొరేట్‌గా మార్చారు
- రాష్ట్ర ప్రభుత్వాలను కూలగొట్టేందుకు బిజెపి కుట్ర
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కునంనేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కోరలు కలిగిన ఎన్నికల కమిషన్ ధృతరాష్ట్రునిలా కండ్లకు గంతలు కట్టుకొని చూసీచూడనట్టుగా వ్యవహరిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కునంనేని సాంబశివరావు విమర్శించారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ భావజాలం ప్రకారం బిజెపి నడుస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థలను అదిరించి బెదిరించి ఇడిలను, సిఐడిల ద్వారా దాడులు చేయించడంతోపాటు వారిని లొంగదీసుకుని పార్టీలో చేర్చుకొంటుందని విమర్శించారు. తద్వారా ఎలక్షన్ బాండ్ పేరుతో డబ్బులు వసూలు చేసి ఎన్నికల్లో వందల కోట్లు ఖర్చుపెట్టి అనైతికంగా గెలవాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా డబ్బుతోని గెలవాలన్న దురుద్దేశంతో వేలాది కోట్లు వెదజల్లుతున్నారని, ఎన్నికలను కార్పొరేట్‌గా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను మోడీ, అమిత్‌షా టార్గెట్‌గా చేసుకొని ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాలను కూలగొడుతున్నారన్నారు. రాజగోపాల్‌రెడ్డిని ఒక పావుగా చేసుకొని రాజీనామా చేయించి మునుగోడు ఉపఎన్నిక తీసుకొచ్చారని చెప్పారు. ఎన్నికలంటే ప్రజాస్వామ్యాన్ని బాగుపరిచే విధంగా ఉండాలి కానీ డబ్బును వెదజల్లి ఓట్ల పండగల ఉండకూడదని అన్నారు. ఇలాంటి స్థితిలో నీతివంతంగా నిజాయితీగా పోటీ చేయాలనుకుంటున్న కమ్యూనిస్టులు, సామాన్య ప్రజల పరిస్థితి ఎలా అనే చర్చ మొదలైందన్నారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తున్న ప్రధాని మోడీ.. ఇటీవల మునుగోడు ఎన్నికలలో తనకు తెలియకుండానే ఇన్ని వేల కోట్లు ఖర్చు పెట్టారా? సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. నలుగురు ఎమ్మెల్యేల కొనుగోలు విషయంలో తమకు ఎలాంటి సంబంధం లేదని తడిబట్ట స్నానం చేసిన బిజెపి నాయకులు సిబిఐ ద్వారా ఎందుకు విచారణ చేయమంటున్నారు.. సిట్ ద్వారా ఎందుకు వద్దంటున్నారని నిలదీశారు. మఠాలలో ఉండే మఠాధిపతులను మంతనాలకు పిలిపించి వారిని రాజకీయాల్లోకి లాగుతున్నారని విమర్శించారు. సింగరేణి పరివాహక ప్రాంతంలో కొత్తగా ఏర్పడిన నాలుగు మైనింగ్‌లు సింగరేణివని అగ్రిమెంట్ ఉన్నప్పటికీ.. అరబిందో కంపెనీకి సింగిల్ టెండర్ మీద 24 వేల కోట్లకు ఇచ్చింది వాస్తవమా కాదా చెప్పాలని ప్రశ్నించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 2014, 18 ఎన్నికల్లో తమతో కాంగ్రెస్ పార్టీ పొత్తు పెట్టుకుని మోసం చేసిందన్నారు. జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, నాయకులు మందడి నరసింహారెడ్డి, అంజయ్య చారి, గురుజ రామచంద్రం, తిరుపారి వెంకటేశ్వర్లు, బచ్చుగాని అంజయ్య, బొలుగూరి నరసింహ, గిరి రామ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫీజు గడువు 24 వరకు పొడిగింపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించే పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఫీజు చెల్లింపు గడువును రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 24వ తేదీ వరకు పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్య రుసుం రూ.50తో వచ్చేనెల ఐదో తేదీ వరకు, రూ.200తో అదేనెల 15 వరకు, రూ.500తో 29 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశముందని తెలిపారు. ఆయా తేదీల్లో సాధారణ సెలవులుంటే మరుసటి రోజు చెల్లించొచ్చని సూచించారు. విద్యార్థులు ఇతర సమాచారం కోసం ఓఓఓ.ఎంఎవ్.వశ్రీఖఅస్త్రుఖఖ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

కూతురిపై తండ్రి లైంగికదాడి

- పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో అమానుష ఘటన జరిగింది. కన్న తండ్రే కూతురిపై దారుణానికి ఒడిగట్టాడు. కాగజ్‌నగర్ డిఎస్‌పి కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నౌగాం బస్తీకి చెందిన ఓ వ్యక్తి మూడు నెలలుగా తన కూతురిపై లైంగిక దాడి చేస్తున్నాడు. బాలిక తల్లికి విషయం చెప్పడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తండ్రిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు డిఎస్‌పి వివరించారు.



కృష్ణ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్, చిరంజీవి


కృష్ణ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న చంద్రబాబునాయుడు


కృష్ణ కుమారుడు మహేష్‌బాబును ఓదార్చుతున్న వెంకయ్యనాయుడు


కృష్ణ పార్థివ దేహం వద్ద విలపిస్తున్న మోహన్‌బాబు

సినీరంగానికి తీరనిలోటు : తమ్మినేని

సుప్రసిద్ధ సినీ నటుడు, పార్లమెంట్ మాజీ సభ్యులు ఘట్టమనేని కృష్ణ మరణించడం చాలా బాధాకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. అల్లూరి సీతారామరాజు లాంటి సామాజిక చిత్రాల్లో నటించడమే కాకుండా, చాలా సినిమాలను నిర్మించి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. చిత్ర పరిశ్రమలో నూతన ప్రయోగాలు చేశారని తెలిపారు. కృష్ణ మరణం సినీ రంగానికి, అభిమానులకు తీరని లోటని పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ప్రముఖ చలనచిత్ర నటుడు ఘట్టమనేని కృష్ణ మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంతాపం ప్రకటించారు.


కృష్ణ పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న రాఘవేంద్రరావు

పులిదాడిలో గిరిజన రైతు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని చౌపన్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో పులి దాడి చేయడంతో గిరిజన రైతు సిడాం భీము(69) మృతి చెందారు. సోమవారం రాత్రి పత్తి చేనుకు కాపలాకు వెళ్లగా పులి దాడి చేసింది. భీమును కొంతదూరం ఈడ్చుకెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పులి రైతును హతమార్చడంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భీము కుటుంబ సభ్యులకు అటవీ శాఖ అధికారులు ఎక్స్‌గ్రేషియా అందజేసి ఆదుకోవాలని సర్పంచ్ సిడాం అన్నిగ కోరారు.

దహెగాంలో కోడె మృతి

దహెగాం మండలంలోని ఖర్జీ అటవీ ప్రాంతంలో పెద్దపుల్లి దాడిలో కోడె మృత్యువాత పడింది. మేతకు వెళ్లిన ఎద్దుపై పులి దాడి చేయడంతో అక్కడికక్కడే మృత్యువాత పడినట్టు రైతు లంగారి వెంకటేశ్ తెలిపారు. కోడె విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు.

కేంద్రంపై కలిసికట్టుగా పోరాడాలి

- ఉపాధి హామీ చట్టం నిధుల్లో కోత తగదు
- బిజెపియేతర ప్రభుత్వాలపై గవర్నర్లతో దాడి
- కేరళ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎంబి రాజేశ్
- పేదల నోట్లో మట్టికొట్టాలని కేంద్రం చూస్తుంది : మంత్రి ఎర్రబెల్లి
- ఏప్రిల్ 5న మార్చ్ టూ పార్లమెంట్ : వెంకట్



సెమినార్‌లో మాట్లాడుతున్న కేరళ మంత్రి ఎంబి రాజేశ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగం, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని కేరళ గ్రామీణాభివృద్ధి, ఎక్సైజ్ శాఖ మంత్రి ఎంబి రాజేశ్ అన్నారు. ఇలాంటి తరుణంలో కేంద్రంపై కలిసికట్టుగా పోరాడాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన పిలుపునిచ్చారు. తరుచూ ప్రశ్నించే రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఎంపిలు, ఎమ్మెల్యేలపై ఐటి, ఈడీ, సిబిఐ వంటి సంస్థలను ఉసిగొల్పుతూ ఆ సంస్థల ప్రతిష్టతను దెబ్బతీస్తున్నదని విమర్శించారు. కేంద్రం తీరును ప్రశ్నిస్తున్న కేరళ, తమిళనాడు, తెలంగాణ ప్రభుత్వాలను మోడీ సర్కారు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని చెప్పారు. తానేం చేయలేక గవర్నర్లతో దాడి చేయిస్తున్నదని విమర్శించారు. కేరళలో గవర్నర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ లక్షలాది మంది రోడ్లెక్కి నిరసన తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. మధ్యప్రదేశ్, గోవా, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చి బిజెపి తన ప్రభుత్వాలను ఏర్పచుకున్న తీరును వివరించారు. కేంద్రం సరిగ్గా సహకరించకపోయినా ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఉపాధి పనుల కల్పనలో ముందు వరుసలో ఉందనీ, కేరళకు ఏడు జాతీయ అవార్డులు రావడమే నిదర్శనమని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పనులు కల్పిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 'గ్రామీణ ఉపాధి హామీ అమలు -సవాళ్లు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీ రాజేశ్ మాట్లాడుతూ..యూపీఏ-1 ప్రభుత్వం కమ్యూనిస్టుల ఒత్తిడితో కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందనీ, దీని ద్వారా నేటికీ కోట్లాది మంది వ్యవసాయ కార్మికులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. పార్లమెంట్ సాక్షిగా ప్రధాని మోడీ ఉపాధి హామీ చట్టం ద్వారా నిధులు వృథా అవుతున్నాయని మాట్లాడటం దుర్మార్గమన్నారు. ఏటేటా నిధులు తగ్గించటం, కార్పొరేట్ మీడియాతో చట్టంపై కేంద్ర ప్రభుత్వం విషప్రచారం చేయడం వంటి చర్యలకు పూనుకున్నదని విమర్శించారు. తమ రాష్ట్రంలో 2016లో 684.12 లక్షల పనిదినాలు కల్పిస్తే ప్రస్తుతం 1059 లక్షల పనిదినాలకు అది చేరిందనీ, ఇది తమ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం సాధించిన ఘనత అని తెలిపారు. ట్రైబల్ ఏరియాల్లో 200 రోజుల ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. ఈ చట్టం ద్వారా చేసే పనుల్లో మహిళలను ఎక్కువగా భాగస్వామ్యం చేయడంలో తమ ప్రభుత్వం విజయవంతమైందన్నారు. 99.19 శాతం వేతనాలను పని చేసిన 15 రోజుల లోపే కూలీలకు చెల్లిస్తున్నామనీ, ఒకవేళ ఆలస్యమైతే అధికారులను బాధ్యులుగా చేసి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు పనిదినాల కల్పనలోనూ ఆంక్షలు విధించుకుంటూ పోతున్నదని విమర్శించారు.

18 టీమ్‌లు పంపినా ఏమీ చేయలేకపోయారు... : మంత్రి ఎర్రబెల్లి

ఉపాధి హామీ చట్టంలో కఠిన నిబంధనలు తీసుకొస్తూ నిర్వీర్యం చేసే పనిలో మోడీ సర్కారు ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. చట్టాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న తెలంగాణ, కేరళ రాష్ట్రాలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదన్నారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై కక్షకట్టి ఆరు నెలలుగా అక్కడ ఉపాధి హామీ చట్టాన్ని నిలిపివేసిందని విమర్శించారు. బిజెపి అధికారంలో లేని ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, పంజాబ్‌లో ఇప్పటికే పర్యవేక్షణ టీమ్‌ల పేరిట వేధింపులు మొదలుపెట్టిందని తెలిపారు. తెలంగాణలో 2014 నుంచి 2018 వరకు కేవలం మూడు టీమ్‌లను పంపిస్తే...ఈ ఏడాది 18 టీమ్‌లను పంపించి తప్పులు ఎత్తిచూపే ప్రయత్నం చేసి విఫలమైందన్నారు. రైతు చట్టాలను వ్యతిరేకించినందుకు తెలంగాణ సర్కారుపై కేంద్రం కక్షగట్టి వ్యవహరిస్తుందన్నారు. తీర ప్రాంత రాష్ట్రాల్లో చేపలు, రొయ్యలు ఎండ బెట్టుకోవడానికి అనుమతించడం, తెలంగాణలో కల్లాలను అడ్డుకోవడం వివక్ష కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణలో ఈజీఎస్ కింద 11 శాతం చెరువు పూడిక పనులు చేస్తే తప్పంట..అదే గుజరాత్ 20 నుంచి 30 శాతం చేసినా తప్పుకాదనటం ఏంటని నిలదీశారు. ఉపాధి హామీపై కేంద్ర వైఖరికి నిరసనగా జాతీయ స్థాయిలో రాష్ట్రాలు సమష్టి పోరాటం చేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు.

ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం కేంద్రంపై పోరాడుతాం: బి.వెంకట్

ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం కేంద్రంతో నిలబడి కొట్లాడుతామనీ, ఏప్రిల్ 5, 2023న మార్చ్ టూ పార్లమెంట్ కార్యక్రమాన్ని చేపడతామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ప్రకటించారు. ఆలోపు ఊరూరు తిరిగి ప్రజలను చైతన్యపరుస్తామనీ, సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహిస్తామని చెప్పారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం పోరాడాలని సెమినార్ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు చదివి వినిపించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో ఆ సంఘం రాష్ట్ర నాయకులు ప్రసాద్, బి.పద్మ, నారి ఐలయ్య, కొండమడుగు నర్సింహ్మ, ములకలపల్లి రాములు, ఎం.ఆంజనేయులు, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కిందపడి చిన్నారి దుర్మరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ట్రాక్టర్ అతివేగం మూడేండ్ల చిన్నారి ప్రాణాలను బలిగొన్నది. అన్నయ్యను స్కూలుకు పంపించేందుకు అమ్మతో కలిసి రోడ్డు దాటుతున్న ఆ పిల్లాడిని ట్రాక్టర్ బలంగా ఢీకొట్టడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని దౌల్తాబాద్ గ్రామంలో మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ గ్రామానికి చెందిన కాలే మాలతి, నవీన్ దంపతులకు ఇద్దరు సంతానం. అయితే పెద్దకొడుకును స్కూలుకు పంపించేందుకు మాలతి తన చిన్నకొడుకు శ్రీహాన్(3)తో కలిసి రోడ్డు దాటుతున్నది. ఈ క్రమంలో దౌల్తాబాద్ గాంధీ చౌరస్తా నుంచి బస్టాండు వైపు ట్రాక్టర్ అతివేగంగా వస్తూ శ్రీహాన్‌పైకి దూసుకొచ్చింది. ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీ వెనుక చక్రం ఆ పిల్లాడి తలపై నుంచి వెళ్లడంతో.. తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాద ఘటనను చూసిన స్థానికులు సైతం కంటనీరుపెట్టుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్టు పోలీసులు తెలిపారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

ప్రజాశక్తి - కల్చరల్

జ్ఞాన సముపార్జనకు దోహదం చేసే గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని బి.సి.కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళ భరణం కృష్ణమోహన రావు అన్నారు. చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో ఆరంభమైన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలులో భాగంగా రెండవ రోజు మంగళవారం గ్రంథాలయ ప్రాంగణంలో పుస్తక ప్రదర్శన ప్రారంభమైంది. ప్రదర్శనను ప్రారంభించిన డాక్టర్ కృష్ణమోహనరావు మాట్లాడుతూ.. పుస్తక పఠనం తగ్గి యూట్యూబ్ కల్చర్‌కు అలవాటు పడుతున్న యువత గ్రంథాలు చదవక పోవటం వల్ల ఎంతో కోల్పోతున్నారన్నారు. ఆరోగ్యకర జీవనంలో ఉత్తమ గ్రంథాలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. నగర కేంద్ర గ్రంథాలయం ఆధునీకరించి విద్యార్థులకు అందుబాటులో ఉంచారని అభినందించారు. నగర గ్రంథాలయ సంస్థ ఛైర్ పర్సన్ ప్రసన్న రామమూర్తి మాట్లాడుతూ ..పుస్తక ప్రదర్శనలో పలు గ్రంథాలు ప్రత్యేకించి విద్య సంబంధిత, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు ఉంచామని తెలిపారు. కార్యదర్శి పద్మజ నివేదిక సమర్పించారు.

క్రిస్మస్ వేడుకలపై మంత్రి కొప్పుల సమీక్ష

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

క్రిస్మస్ వేడుకలపై సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మంగళవారం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతేడాది మాదిరిగానే ఈ ఏడాదీ క్రైస్తవ కుటుంబాలకు నాణ్యమైన దుస్తులు పంపిణీ చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రిస్టియన్లలోని అతి బీద కుటుంబాలకు 2.25 లక్షల చీరలు పంపిణీ చేయాలని సూచించారు. డిసెంబర్ మొదటి వారంలో క్రిస్మస్ వేడుకలకు సంబంధించిన సమావేశాలు ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, మైనారిటీ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి హెచ్‌ఎం నదీమ్, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎకె ఖాన్, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఎండి కాంతి వెస్లీ, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ ఖాసిం పాల్గొన్నారు.

టిఆర్ఎస్ ర్యాలీలో అపశ్రుతి

- బాణాసంచా పేలి ముగ్గురికి తీవ్ర గాయాలు
- హ్యాండ్లూం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్‌కు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఆర్ఎస్ నిర్వహించిన బైక్ ర్యాలీలో అపశ్రుతి చోటుచేసుకుంది. బాణాసంచా పేలి ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. సంగారెడ్డిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభం సందర్భంగా చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ నాయకత్వంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచా పేల్చేందుకు హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడకు చెందిన ముగ్గురు యువకులు కుశాల్ అలియాస్ సిద్దు, సందీప్, సుభాష్ అలియాస్ బబ్లూకు కాంట్రాక్టు ఇచ్చారు. తమ ఆటోలో తెచ్చిన బాణాసంచాను ర్యాలీలో కాల్చుతూ ముందుకు వెళ్తున్నారు. కలెక్టరేట్ సమీపంలోకి చేరుకోగానే ప్రమాదవశాత్తు పైకి పోవాల్సిన బాణాసంచా తిరిగి ఆటోలో పడిపోయింది. దాంతో ఆటోలోని బాణాసంచాకు నిప్పంటుకుని పెద్ద ఎత్తున పేలుడు సంభవించింది. ఆటోలో ఉన్న ముగ్గురు యువకులకు నిప్పంటుకుంది. మంటలు అంటుకున్న యువకుల్లో కుశాల్‌కు తీవ్రగాయాలయ్యాయి. సందీప్, బబ్లూలకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే స్పందించిన టిఆర్ఎస్ నాయకులు కుశాల్‌కు అంటుకున్న మంటలను ఆర్పివేశారు. మంటలను ఆర్పుతున్న సందర్భంలో టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు చింతా ప్రభాకర్‌కు స్వల్పగాయాలయ్యాయి. బాధితులను సంగారెడ్డి ప్రభుత్వాపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అందించిన వైద్యులు కుశాల్ శరీరం 90 శాతం కాలిపోయిందని తెలిపారు. వెంటనే అతన్ని హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో 10 టీవీ కెమెరామెన్ వినోద్ బైకుపై నిప్పు రవ్వలు పడ్డాయి. వెంటనే అతను బైక్ వదిలేసి తప్పించుకున్నారు. కాలిపోతున్న బైకును నీళ్లతో ఆర్పారు. గాయపడిన చింతా ప్రభాకర్‌కు వైద్యులు చికిత్స అందించారు. పేలుడు శబ్దాలు విన్న కలెక్టరేట్ సమీపంలోని కాలనీవాసులు భయాందోళనలకు గురయ్యారు.


బాణాసంచా పేలిన ప్రదేశం

రైల్ నిలయం ఎదుట కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రైల్వే కాంట్రాక్టు కార్మికులను కాంట్రాక్టర్లు మనుషులుగా పరిగణించటం లేదనీ, వారితో యంత్రాల మాదిరిగా పనిచేయించుకుని తగిన వేతనాలు ఇవ్వకుండా ఎగ్గొడుతున్నారని హైదరాబాద్ రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం వెంకటేశ్ విమర్శించారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ముందు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా 2022 అక్టోబర్ 1 నుంచి పెరిగిన డీఏ ప్రకారం రూ.18,486 కనీస వేతనం ఇవ్వాలి, ప్రతి కాంట్రాక్టు కార్మికునికి దసరా సందర్భంగా ఒక నెల జీతం బోనస్, చట్టం ప్రకారం ప్రతి నెల ఏడో తేదీలోపు జీతాలు, ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ కార్డు ఇవ్వాలని వుయ్ వాంట్ జస్టిస్ అంటూ కార్మికులు నినదించారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటాలు నిర్వహిస్తామంటూ హెచ్చరించారు. ఆ తర్వాత సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను యూనియన్ కన్వీనర్ రమేష్ బాబు, ఎం వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి ఎ శాంతులుగౌడ్, నాయకురాలు ఈదమ్మ కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం వెంకటేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో సుమారు ఏడు లక్షల మంది రైల్వే కాంట్రాక్టు కార్మికులున్నారనీ, వారికి ఎలాంటి చట్టబద్ధ హక్కులు అమలు కావటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల పరిధిలో పనిచేస్తున్న రైల్వే కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం 18,486 చెల్లించాలని డిమాండ్ చేశారు. రైల్వే యాజమాన్యం ఖర్చు తగ్గించుకోవాలనే పేరుతో కార్మికుల సంఖ్యను తగ్గిస్తున్నదన్నారు. దీంతో ఉన్న కార్మికులపై పనిభారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో కార్మికుల సంఖ్య పెంచి టెండర్లను పిలవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చట్టపరమైన హక్కులు కల్పించాలని అడిగితే..వారిపై కక్ష సాధింపు చర్యలకు కాంట్రాక్టర్లు పాల్పడుతున్నారని చెప్పారు. రైల్వే అధికారులు పట్టించుకోక పోవటం వల్లనే కాంట్రాక్టర్లు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రమేష్ బాబు మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై పలు సార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయామని చెప్పారు. అయినా వారు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పుణ్యవతి

గరికపాటి బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ఎస్ పుణ్యవతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహిళలను కించపరుస్తూ మాట్లాడిన గరికపాటి నర్సింహరావు మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ నాయకులు ఎస్ పుణ్యవతి డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని వీరనారి ఐలమ్మ ట్రస్టు భవన్‌లో ఐద్వా ఆధ్వార్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుణ్యవతి మాట్లాడుతూ గరికపాటి ప్రవచనాలతో ఆడవాళ్లను కించపరుస్తూ మాట్లాడటం ఎంత వరకు సబబో చెప్పాలని ప్రశ్నించారు. మహిళలు పనులు చేసేటప్పుడు చీరెలు అసౌకర్యంగా ఉంటాయని చెప్పారు.

చేస్తున్న పనిమీదనే దృష్టి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గరికపాటి అర్థం చేసుకోవాలని సూచించారు. తప్పుడు వ్యాఖ్యానాలు చేయటం మానుకోవాలన్నారు. స్త్రీల కట్టు, బొట్టు, వారి అవయవాల మీద వ్యాఖ్యానాలు చేసే హక్కు గరికపాటికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. లైంగిక వేదింపుల నిరోధక చట్టం, వర్మ కమిషన్ రిపోర్టుల ప్రకారం శిక్షార్హుడవుతారని తెలిపారు. స్త్రీలూ మనుషులేననీ, వారిని భోగ వస్తువుగా చూడకూడదని హితవు పలికారు. ఐద్వా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి, భూమిక ఎడిటర్ సత్యవతి, పీఓడబ్ల్యు సంధ్య, అంకురం శామల, ఎల్ఐసి అరుణ మాట్లాడుతూ గరికపాటి ప్రతి ప్రవచనంలో స్త్రీలను అగౌరవ పరుస్తూ వ్యాఖ్యానించడం సమజసం కాదన్నారు.. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత స్త్రీలపై అడ్డగోలుగా మాట్లాడేవారి సంఖ్య పెరిగిందని చెప్పారు. తినే తిండి, కట్టుకునే బట్టల మీద ఆంక్షలు విధించే రాజ్యంలో మనం ఉన్నామన్నారు. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శరీరాన్ని ఏనుగుతో పోలుస్తూ అవహేలన చేయటం నేరమన్నారు. గరికపాటిపై అన్ని పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టాలన్నారు. పిఒడబ్ల్యు ఝాన్సీ, పుష్ప, ఐద్వా రాష్ట్ర నాయకులు కె నాగలక్ష్మి, ఎం లక్ష్మమ్మ, పి రమాదేవి, ఎ పద్మ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ లీజు రద్దు చేయాలి

- ఏడు గ్రామ పంచాయతీల ఏకాభిప్రాయ నిర్ణయం
- సమాచారం ఇవ్వకుండా ప్రజాభిప్రాయ సేకరణ !
- అధికారుల తీరుపై నేతల మండిపాటు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'మా ఇండ్లు, బోర్లు కూలుతున్నాయి. మా పంటలు సర్వనాశనం అవుతున్నాయి. మా బతుకులు ఆగమవుతుంటే.. ఇటువైపు ఎవరు కన్నెత్తి చూడరు. క్రషర్ గుంతలో పడి పశువులు మరణిస్తున్నా, చర్మవ్యాధులతో మా బతుకులు బుగ్గి పాలు అవుతున్నా పట్టించుకునే నాధుడే లేడు.' అంటూ ప్రజాభిప్రాయ సేకరణలో అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావుకు ఏడు గ్రామాల ప్రజలు మూకుమ్మడిగా ఏకాభిప్రాయంతో తమ ఆవేదన వెలిబుచ్చారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో మైనింగ్ లీజు కాలపరిమితి పూర్తి కావడంతో తిరిగి రెన్యువల్ చేయాలని మైనింగ్ యజమానులు అర్జీ పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సంగీతతో కలిసి సిద్దాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామ పంచాయతీలైన సిద్దాపూర్, ఎస్‌బిపల్లి, కొడిచర్ల, కొడిచర్ల తండా, ఇముల్ నర్వ, వైఎం తాండా గ్రామాల సర్పంచులు, ప్రజలు హాజరై తమ కష్టనష్టాలను ఆయనకు మొరపెట్టుకున్నారు.

క్రషర్ మిషన్‌లో భారీ మందు పాతరలు పెట్టి బ్లాస్టింగులు చేస్తుండడంతో బోరు బావులు కూలిపోయి, మోటర్లు భూమి లోపల ఇరుక్కుపోతున్నాయి తీవ్రంగా నష్టపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భార్యల పుస్తెలతాడు సైతం అమ్మి బోరు మోటార్లు కొని తిరిగి అమర్చుకున్నా కొద్దిరోజులకే మళ్లీ ఇరుక్కుపోతున్నాయని, బ్లాస్టింగ్ వల్ల వచ్చే దుమ్ముతో తమ పంటలు నాశనం అవుతున్నాయని, చర్మవ్యాధులు సోకి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నామని తెలిపారు. లక్షల రూపాయలు పెట్టి ఇల్లు నిర్మించుకుంటే ఇండ్లకు పగుళ్లు ఏర్పడి శిథిలమైపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రషర్ గుంతలో పడి ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఎన్నో పశువులు అందులో పడి బయటికి రాలేక ప్రాణాలు వదిలాయన్నారు. ఇంత జరిగినా మమ్మల్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారని, ఇప్పటికైనా తమ కష్టాలను అర్థం చేసుకొని తమ జీవితాలను కాపాడాలంటూ అడిషనల్ కలెక్టర్ ముందు ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. మైనింగ్‌పై ప్రజల అభిప్రాయాలు సేకరించామని, దాదాపు అందరూ వ్యతిరేకించినట్టు తెలిపారు.

కార్యక్రమంలో షాద్‌నగర్ ఎసిపి కుషాల్కర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ తిరుపతిరావు



తెలంగాణ రైతు సంఘం నాయకులు

వ్యవసాయ రంగ రక్షణ కోసం పోరాడుదాం

- ఎఐకెఎస్ 35వ మహాసభను జయప్రదం చేయండి.
- తెలంగాణ రైతు సంఘం నాయకులు చంద్రారెడ్డి, టి సాగర్ పిలుపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా, వ్యవసాయరంగ రక్షణ కోసం పోరాడుతున్న అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 35వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం పిలుపునిచ్చింది. బిర్సాముండా జయంతిని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి ఎఐకెఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. కనీస మద్దతు ధరల చట్టం చేస్తామని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరిస్తామంటూ హామీ ఇచ్చిందని, నేటి వరకు మద్దతు ధరల చట్ట ప్రయత్నం చేయలేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఏటా పది వేల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం ఏరకమైన ప్రయత్నం చేయలేదన్నారు. రైతుల రుణమాఫీ చేయడం చేతగానీ బిజెపి సర్కారు... కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రూ 11 లక్షల కోట్ల రాయితీలు ఇచ్చిందన్నారు. పంటల బీమా పథకం రైతాంగాని కంటే ఇన్సూరెన్స్ కంపెనీలకే ఉపయోగపడేలా ఉందన్నారు. రైతులకు, వ్యవసాయ కూలీలకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకాన్ని రూ.18,000లకు పెంచాలని కోరారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 13 నుంచి 16 వరకు కేరళ రాష్ట్రంలోని త్రిసూర్‌లో జరుగుతున్న ఎఐకెఎస్ మహాసభల జయప్రదం చేయాలని కోరారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 500 కేంద్రాల్లో జెండా ఆవిష్కరణలు జరిగాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ అరిబండి ప్రసాద్‌రావు, పి.జంగారెడ్డి, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సబిత

యుజి విద్యార్థులకే నిజాం హాస్టల్

- మంత్రి సబిత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నిజాం కళాశాలలో నూతనంగా నిర్మించిన హాస్టల్ పూర్తిగా యూజీ విద్యార్థులకే కేటాయిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ విషయమై కొద్దిరోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్, నిజాం కళాశాల ప్రిన్సిపల్, కళాశాల విద్యార్థినులతో ఆమె సమావేశమయ్యారు. నిజాం కళాశాల విద్యార్థినుల సమస్యను మానవతా దృక్పథంతో పరిష్కరించాలంటూ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కెటి రామారావు సూచన మేరకు ఈ సమావేశాన్ని నిర్వహించామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మార్గదర్శక నిబంధనలకు అనుగుణంగా వసతి కల్పించాలంటూ అధికారులను ఆమె ఆదేశించారు. విద్యార్థినిలందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర చరిత్రలోనే మొదటి సారిగా నిజాం కళాశాలలో యూజీ విద్యార్థినిలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. వారికి కావాల్సిన ఏర్పాట్లను చేయాలని నిజాం కళాశాల ప్రిన్సిపల్‌ను ఆదేశించారు.

చిత్రపురి కాలనీలో అక్రమాలపై చర్యలు తీసుకోండి

- సిఎం కెసిఆర్‌కు తమ్మినేని లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సినీ వర్కర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ (రిజిస్టర్ నెంబర్ టిబిసి 608-1994) చిత్రపురి కాలనీలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు మంగళవారం ఆయన లేఖ రాశారు. 1994లో అప్పటి ప్రభుత్వం సినీ కార్మికుల కోసం మణికొండ (చిత్రపురి కాలనీ)లోని సర్వే నెంబర్ 246/1లో 67.16 ఎకరాల భూమిని జిఒ నెంబర్ 658 ద్వారా కేటాయించిందని తెలిపారు. దీనిలో సినీ వర్కర్స్ కో-ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ వారు అక్రమాలకు పాల్పడుతున్నట్టు, అధికారులు కూడా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు, తగు న్యాయం జరిగేలా చూడాలంటూ తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. సహకార సంఘాల చట్టం నిబంధనల ప్రకారం 4213 ఫ్లాట్ల కోసం 4,800 మంది సభ్యులు ఉండాలని తెలిపారు. కానీ 2005-2022 సంవత్సరాలకు సంబంధించిన కమిటీ 9,162 మందికి సభ్యత్వం ఇచ్చిందని వివరించారు. ఈ భూమి విలువ రూ.200 కోట్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. కానీ ప్రయివేట్ వ్యక్తులకు కేవలం రూ.22 కోట్లకు మాత్రమే 24 శాతం వడ్డీకి తాకట్టుపెట్టిందని తెలిపారు. ఈ అప్పుల భారాన్ని కూడా సభ్యులపై వేస్తున్నదని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేసి రూ.116 కోట్ల అక్రమాలు జరిగినట్టుగా ధృవీకరించిందని తెలిపారు. ఈ డబ్బును అక్రమార్కుల నుంచి వసూలు చేయకుండా నిర్లక్ష్యం జరుగుతున్నదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయలు అడ్వాన్స్‌గా ఇచ్చి, వారి వద్దనుంచి కిక్ బ్యాక్స్ రూపంలో 2005-2020 మధ్య కోట్ల రూపాయలు కమిటీ సభ్యులు డ్రా చేశారని వివరించారు. సినీకార్మికులకు తెలియకుండానే వారి ఇండ్లను బయటివారికి విక్రయించారని పేర్కొన్నారు. ఒక సభ్యుని సభ్యత్వం స్థానంలో సంబంధంలేని మరొకరిని అక్రమంగా చేర్చారని తెలిపారు. ఒకే కుటుంబ సభ్యులకు ఎక్కువ ఇండ్లు కేటాయించారని పేర్కొన్నారు. మైనర్లకూ ఇండ్లు కేటాయించారన్నారు. నిర్మాణ ఫండ్, కార్పస్ ఫండ్, డెవలప్‌మెంట్ ఫండ్ కాజేశారని విమర్శించారు. అక్రమంగా 600 ఇండ్లు నిర్మించినట్టుగా బయటపడ్డాయని తెలిపారు. రూ.150 కోట్లు సినీ కార్మికుల డబ్బు ఏమయ్యిందో కో-ఆపరేటివ్ అధికారులు చెప్పడంలేదని పేర్కొన్నారు. నాలుగు నెలల్లో మొత్తం చిత్రపురిని సరిదిద్దాలంటూ హైకోర్టు ఆదేశాలిచ్చి ఏడాది దాటినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ విధంగా చిత్రపురి కమిటీ సభ్యులు, అధికారుల అక్రమాలు బయటపడ్డాయని తెలిపారు. ఈ విషయాల్లో అధికారులు కూడా వారితో కుమ్మక్కయ్యారనీ, అయినా వారినే ఇప్పటికీ కమిటీ సభ్యులుగా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాలను గతంలో కూడా సీఎం కేసీఆర్ దృష్టికి లేఖ ద్వారా తెచ్చామని గుర్తు చేశారు. ఈ అక్రమాలను విచారించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ప్రయివేటు బస్సు దగ్ధం

- డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులు సురక్షితం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

షార్ట్ సర్క్యూట్‌తో ప్రయివేటు బస్సు దగ్ధమైంది. నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా సమీపంలో ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై మంగళవారం వేకువజామున మూడు గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న మహారాష్ట్రకు చెందిన ఎంహెచ్ 40 ఎటి 9966 నెంబర్ గల బస్సులో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. డ్రైవర్ వెంటనే అప్రమత్తం కావడంతో బస్సులో ప్రయాణిస్తున్న 29 మందిని లగేజీ సహాయంతో కిందకి దింపేశాడు. దాంతో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న సోన్ సిఐ రామ్ నర్సింహారెడ్డి, ఎస్ఐ సంతోషం రవీందర్, అశోక్ ఘటన స్థలానికి చేరుకుని ఫైర్‌ఇంజన్ సాయంతో మంటలు అర్పించారు. ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్, ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.